క్లుప్తంగా

సామాజిక సేవలో ముందుండాలి



సీపీఐ వందేళ్ల సంచికలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు, నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా సమస్యలపై పోరాటాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోను కమ్యూనిస్టు నాయకులు ముందుండాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. పట్టణంలోని డీఎస్పీ క్యాంప్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సీపీఐ వందేళ్ల చరిత్ర, పోరాటాలు, త్యాగాలపై రూపొందించిన ప్రత్యేక సంచికను సీపీఐ నాయకులతో కలిసి డీఎస్పీ ఆవిష్కరించారు. బడుగులు, రైతులు, విద్యార్థుల సమస్యలపై సీపీఐ చేపట్టిన పలు ఉద్యమాలను గుర్తుచేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం తాలుకా కార్యదర్శి భాస్కర్‌యాదవ్, చిన్నన్న, జబ్బార్ ఉన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

ఆదోని అర్బన్: మైనర్లు (18 ఏళ్లలోపు వారు) బైక్‌లు నడపరాదని, నిబంధనలు ఉల్లంఘించి నడిపితే శిక్షార్హులవుతారని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని నేషనల్ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణమైతే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని ఇంట్లో వాళ్లకు తెలియజేయాలని సూచించారు. మంచి మార్గంలో నడిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

గోనెగండ్ల: మండలంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది గ్రామాలలో సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ మణిమంజరి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండల అధికారులు, సర్పంచులు, వీఆర్వోలు, సర్వేయర్లు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మణిమంజరి, ఈఓఆర్డీ అనంతసేన మాట్లాడుతూ.. గ్రామాలలో నీరు, పరిశుభ్రత, పచ్చదనం, మౌలిక వసతులు, సామాజిక భద్రత, బాల్య వివాహాలు అరికట్టడం ఇలాంటి 9 అంశాలలో ప్రతి గ్రామం ముందుండేలా చూడాలన్నారు. సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని అర్బన్: పట్టణంలోని పాత ఓవర్ బ్రిడ్జి వద్ద కర్ణాటక మద్యం తరలిస్తుండగా శుక్రవారం దాడి చేసి రెండు బాక్సులు స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక వాల్మీకినగర్ కాలనీకి చెందిన గొల్ల విజయ్ 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లను తరలిస్తున్నారని సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.

ఆంజనేయస్వామికి పూజలు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆంజనేయ స్వామి, రామాలయాల్లో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీహారం, వడలహారం, వస్త్ర సమర్పణ, నైవేద్యం, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. పూజారి ఆనంద ఆచారితో హనుమద్వ్రతం కథను తెలియజేశారు. అలాగే మంగరాయ ఆంజనేయస్వామి ఆలయంలో పల్లకీసేవ నిర్వహించారు.

బంగారు వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: బిల్లులు ఇవ్వకుండా బంగారు నగలు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్ సుదర్శన్, సీపీఐ నాయకులు కె.లక్ష్మిరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

- గాజులదిన్నె ప్రాజెక్టు కింద 14,500 మంది ఓటర్లు
- గోనెగండ్ల సెక్షన్ ఎల్లెల్సీ కింద 5,676 మంది ఓటర్లు



గాజులదిన్నె ప్రాజెక్టు

గోనెగండ్ల: మండలంలో శనివారం జరగబోయే సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గాజులదిన్నె ప్రాజెక్టు కింద 12 సాగు నీటి సంఘాలు ఉండగా ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలో 5 నీటి సంఘాలు ఉన్నాయి. అందులో మొత్తం ఓటర్లు 14,500 మంది ఉన్నారు. గోనెగండ్ల ఎల్లెల్సీ కింద మూడు సాగునీటి సంఘాలు ఉన్నాయి. 39 డీపీ 86, 40 పీడీ, 41 ఎంఎల్ఎస్‌పీ ఉన్నాయి. అయితే డీపీ 86 కాలువ కింద గోనెగండ్ల, రాళ్లదొడ్డి, పెద్దమరివీడు గ్రామాలు ఉన్నాయి. ఇందులో 961 మంది రైతులు ఓటర్లుగా ఉన్నారు. అలాగే పీడీ సెక్షన్ కింద 2809 మంది ఓటర్లు ఉండగా అలువాల, చిన్నమరివీడు, గోనెగండ్ల, పెద్దమరివీడు గ్రామాలు ఉన్నాయి. ఎంఎల్ఎస్‌పీ సెక్షన్ కాలువ కింద 1906 మంది ఓటర్లు ఉండగా అలువాల, కులుమాల, చిన్నమరివీడు, పెద్దనేలటూర్ గ్రామాలు ఉన్నాయి. వీటన్నింటికీ శనివారం ఎన్నికలు జరిపేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.

మండలంలో ఎన్నికల కేంద్రాలు

సాగునీటి సంఘాలకు మండలంలో ఎనిమిది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గాజులదిన్నె ప్రాజెక్టు సాగునీటి సంఘాలకు ఐదు కేంద్రాలు 1.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల – హెచ్.కైరవాడి, 2.గ్రామ సచివాలయం – తిప్పనూరు, 3.ఏపీ మోడల్ స్కూల్, 4.ప్రభుత్వ జూనియర్ కళాశాల, 5.జీడీపీ కార్యాలయం ప్రాజెక్టు, అలాగే ఎల్లెల్సీ కాలువలకు మూడు కేంద్రాలు 1.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల– గోనెగండ్ల, 2.ఎంపీపీ స్కూల్ – అలువాల, 3.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల – పెద్దనేలటూర్‌లో ఏర్పాటు చేశారు. టీసీ సభ్యుల ఎన్నికలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటాయి. అనంతరం 3 గంటల నుంచి 5 గంటల వరకు డబ్ల్యూఏ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎన్నిక జరిగే పద్ధతి

సాగునీటి సంఘాల ఎన్నికలను మూడు పద్ధతులలో జరపనున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి పద్ధతి రైతుల మధ్య ఏకాభిప్రాయం, అది కుదరకపోతే చేతులు ఎత్తి మద్దతు తెలపడం. అదీ కుదరకపోతే రహస్య ఓటింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

నందవరం: మండలంలో శనివారం జరగబోయే సాగునీటి ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ బీవీ మధుసూదన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సాగు నీటి ఎన్నికల బందోబస్తుపై ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రం నందవరంతో పాటు నదికైరవాడి, మిట్టసోమపురం, గురజాల, హాలహర్వి, కనకవీడు గ్రామాలలో సాగునీటి ఎన్నికలు నిర్వహిస్తున్నారని, పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించాలని సూచించారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

మండలంలో 7 కేంద్రాలలో శనివారం సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ ఏఈ నీలకంఠ తెలిపారు. నందవరంతో పాటు కనకవీడు, హాలహర్వి, గురజాల, నదికైరవాడి, మిట్టసోమపురంలో ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. అలాగే చిన్నకొత్తిలి మేజర్, గంగవరం మేజర్, మిట్టసోమపురం మేజర్ కాలువలకు సంబంధించి ఎన్నికలు ఉంటాయని చెప్పారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించండి

ఎమ్మిగనూరురూరల్: మండలంలో శనివారం జరగనున్న సాగునీటి వినియోదారుల సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని తహసీల్దార్ శేషఫణి ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక కార్యాలయంలో.. ఎన్నికల నిర్వహణపై అధికారులు, పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఆరు వేల మంది సభ్యులు ఉన్నారని, 4 వాటర్ యూజర్ అసోసియేషన్లు, 2 మైనర్ ట్యాంకులకు సంబంధించి ఎన్నికలు జరగనున్నట్లు చెప్పారు. ఎమ్మిగనూరు, కలుగొట్ల, పార్లపల్లి, పెసలదిన్నె, కె.తిమ్మాపురం గ్రామాల్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. పోలీసులు, అధికారులు ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికలు పకడ్బందీగా జరిగేలా చూడాలన్నారు.

144 సెక్షన్ అమలు



సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాల సమీపంలో 500 మీటర్ల మేర 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఎవరైనా ఓటింగ్ జరిగే సమయంలో గొడవలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. అలాగే ఓటింగ్ జరిగే సమయంలో గుంపులు గుంపులుగా ఉండరాదని సూచించాం. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. – సీఐ గంగాధర్, గోనెగండ్ల



నందవరం పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ బీవీ మధుసూదన్ రావు

భూ సమస్యల పరిష్కారానికి కృషి

గోనెగండ్ల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. హాజరైన సబ్ కలెక్టర్ రైతుల సమస్యలు విని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో ఎలాంటి చలానా లేకుండా ఉచితంగా సేవలు పొందవచ్చన్నారు. రైతుల నుంచి స్వీకరించిన అర్జీలను విచారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, సమస్యలు ఉన్న వాటిని ఇరువర్గాల వారితో చర్చించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ఆదోని రూరల్: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివరాముడు అన్నారు. శుక్రవారం మండలంలోని సంతెకూడ్లూరు, చిన్నహరివాణం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులకు ఏవైనా భూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే విచారణ చేపట్టి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, వీఆర్వో చిన్న వీరన్న పాల్గొన్నారు.

పాఠశాల స్థలాన్ని కాపాడాలి

కోసిగి: డి.బెళగల్ గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని కాపాడాలని హెచ్ఎం జియోన్‌కుమారి, ఉపాధ్యాయులు శుక్రవారం రెవెన్యూ సదస్సులో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థలాన్ని సర్పంచ్ పద్మమ్మ, రెవెన్యూ అధికారులు, గ్రామ నాయకులతో కలిసి పరిశీలించారు. సర్వే నంబర్ 404లో గ్రామ కంఠం కింద ఉన్న భూమిలో 1.50 ఎకరాలు గ్రామ తీర్మానం చేసి పాఠశాలకు కేటాయించారు. ఆ స్థలంలో కొందరు పెంట దిబ్బలు వేసి అపరిశుభ్రంగా మార్చారు. దిబ్బలు వేసి వారికి నోటీసులు జారీ చేసి వెంటనే ఖాళీ చేయించాలని వీఆర్వో రామాంజనేయులు, పంచాయతీ సిబ్బందిని అధికారులు ఆదేశించారు. ఖాళీ చేయకపోతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్వేయర్ శ్రీనివాసులు, గ్రామ సర్వేయర్ ప్రసన్న, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

నందవరం: మండలంలో శనివారం సాగునీటి ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ బీవీ మధుసూదన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సాగునీటి ఎన్నికల బందోబస్తుపై ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. నందవరంతో పాటు నదికైరవాడి, మిట్టసోమపురం, గురజాల, హాలహర్వి, కనకవీడు గ్రామాల్లో సాగునీటి ఎన్నికలు నిర్వహిస్తున్నారని, పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటాలు



కర్నూలుకు తరలివెళ్తున్న కార్యకర్తల వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న బుట్టా రేణుక



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో కర్నూలుకు బయలుదేరిన పార్టీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేపట్టిన ×అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ€ నిరసన కార్యక్రమాని కి తరలి వెళుతున్న పార్టీ కార్యకర్తల వాహనాలను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్‌మెంబర్లు, నియోజకవర్గంలోని మండలాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, నా యకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

భారీగా తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు

ఆదోని టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాకు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ ఆధ్వర్యంలో సుమారు 30 వాహనాల్లో వెళ్లారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, కౌన్సిలర్లు ఫయాజ్, నగరూరు చంద్రశేఖర్‌రెడ్డి, నల్లారెడ్డి, సందీప్‌రెడ్డి, నాయకులు సన్నీ, గోవిందరాజు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి అమానుషం



కోసిగి: డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు



మంత్రాలయం: తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

ఆదోని టౌన్: జర్నలిస్టులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండల కేంద్రంలో నీటి సంఘాల ఎన్నికల కవరేజీకు వెళ్లిన సాక్షి టీవీ రిపోర్టర్ శ్రీనివాస్, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక విలేకరి రాజారెడ్డిపై టీడీపీ నేతలు దాడి చేశారన్నారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నాగరాజు, అధ్యక్షుడు బసవరాజు, ప్రధాన కార్యదర్శి మునెప్ప, మల్లికార్జున, ఉపాధ్యక్షులు విజయ్, మురళి, యూనియన్ సభ్యులు రామచంద్ర, సుంకన్న, రఘునాథ్‌రెడ్డి, భీమ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడి తగదు

మంత్రాలయం: వైఎస్సార్ జిల్లా, పులివెందుల నియోజకవర్గం, వేముల మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజ్ కోసం వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, విలేకరి రాజారెడ్డిపై కూటమి పార్టీల నాయకుడు దాడి చేయడం అమానుషమని సీనియర్ పాత్రికేయులు వడ్డె మాధవ్ వాపోయారు. దాడిని నిరసిస్తూ శుక్రవారం మంత్రాలయంలో విలేకరులు ఆందోళన చేపట్టారు. దాడికి పాల్పడిన కూటమి నేతలను అరెస్టు చేయాలని తహసీల్దార్ ఎస్.రవికి వినతి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత్రికేయులపై దాడులు పెరిగాయన్నారు. వార్తల కవరేజీ కోసం వచ్చిన పాత్రికేయులపై దాడికి దిగిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. పాత్రికేయులు లక్ష్మయ్య శెట్టి, గురుస్వామి, వీరశేఖర్‌శెట్టి, గాబ్రెల్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.


కోసిగి: సాక్షి విలేకరులపై జరిగిన దాడిని ఖండిస్తూ మండలంలోని విలేకరులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజీ నిమిత్తం వెళ్లిన విలేకరులపై మూకుమ్మడిగా దాడులు చేయడం సరికాదన్నారు. పత్రిక స్వేచ్ఛకు ఆటంకం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడకు వినతి పత్రం అందజేశారు. పాత్రికేయులు వీరేష్, రామన్న, విజయ్‌కుమార్, గోపాల్, ఈరన్న, మల్లికార్జున, సిద్ధు, నాగార్జున, ఖాదర్ భాషా, విజయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలో విలేకరులు అబ్దుల్‌షకూర్, గోపాల్, ఇసాక్, ఈరన్న, ఆంజి, ఖాజాహుసేన్ తదితరులు నిరసన చేపట్టి సీనియర్ అసిస్టెంట్ రామయ్యకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, దాడికి పాల్పడిన కూటమి నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్లబండ రోడ్డుకు మరమ్మతులు

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ మార్లబండ ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లేందుకు.. కోతకు గురై అధ్వానంగా ఉన్న రోడ్డును సర్పంచ్ జేకే నరసమ్మ ఆధ్వర్యంలో తాత్కాలికంగా బాగు చేయించారు. ఈ ఏడాది కురిసిన వర్షాలకు రోడ్డు కోతలకు గురై పూర్తిగా దెబ్బతింది. భక్తులు ఇబ్బందులు పడుతున్న వైనంపై గత నెల 7వ తేదీన ×దేవుడే కాపాడాలి€ శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైంది. ఈ మేరకు సర్పంచ్, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు జేకే మల్లయ్య స్పందించి జేసీబీని ఏర్పాటు చేసి రోడ్డుకు ఇరుపక్కలా ముళ్ల పొదలను తొలగించారు. కోతలు, గుంతలు పడిన చోట తాత్కాలికంగా మట్టి వేసి పూడ్చివేయించారు. ఈనెల 15వ తేదీన స్వామి వారి మహా రథోత్సవం వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో జాతరకు వచ్చే భక్తాదులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఏటా ఇదే పరిస్థితి ఉంటోందని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆలయానికి రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం



పనులు ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీమోహన్ రెడ్డి

కోసిగి: మండల పరిధిలోని పెద్దభూంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, డ్రయినేజీ కాల్వలు ఏర్పాటు చేయిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు గట్టు భీమయ్యతో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వందగల్లు, చిన్నభూంపల్లి, పెద్దభూంపల్లి, జంపాపురం, అగసనూరు గ్రామాల్లో డ్రయినేజీ, సీసీ రోడ్ల పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. పనులను నాణ్యతగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చూడి బసిరెడ్డి, లక్ష్మిరెడ్డి, అంజినయ్య, తదితరులు ఉన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు రాజేంద్ర, నారాయణ, శివరామకృష్ణ, నరసప్ప డిమాండ్ చేశారు. తమ సమస్యల సాధన కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. 15 సంవత్సరాల సర్వీసు ఉన్న కార్మికులను క్రమబద్ధీకరించాలని, జాతీయ, రాష్ట్ర పండుగలను సెలవులుగా ప్రకటించాలని లేదా వేతన దినాలుగా ప్రకటించాలని కోరారు. సీనియారిటీ ప్రతిపాదికన జీతాలు చెల్లించాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. సంఘ నాయకులు జాకీర్, వీరేష్, శివన్న, జనార్ధన్, రాజేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

ఆదోని అర్బన్: పట్టణంలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శనివారం ఆదోని నియోజకవర్గంలోని పట్టణ, రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో సమయాన్ని బట్టి విద్యుత్ కోతలు ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మిగనూరులో..

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని విద్యుత్ ఉపకేంద్రంతో పాటు పలు లైన్లలో మరమ్మతు పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ నాగేంద్రప్రసాద్, ఏఈ ప్రసన్న ఆంజినేయులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, గాంధీ నగర్, వీవర్స్ కాలనీ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు రోడ్ల నిర్మాణాలకు శుక్రవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి భూమి పూజ చే సి పనులను ప్రారంభించారు. పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చ ర్యలు తీసుకొంటున్నట్లు ఆయన చెప్పారు. మున్సిపల్ కమిష నర్ గంగిరెడ్డి,డీఈలు, ఏఈలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనల అతిక్రమణపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో స్పెషల్ క్లాసుల పేరుతో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్నారని ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. స్పెషల్ క్లాసుల పేరుతో పాఠశాలల నుంచి విద్యార్థులను రాత్రి వేళ్ల ఇళ్లకు పంపుతున్నారని, ఆ సమయంలో ఎదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ముఖ్యంగా గ్రామాలకు వెళ్లే విద్యార్థులు రాత్రి వేళ వాహన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.